ఊరి మధ్యలో డేంజర్ బెల్స్..!

- పిల్లోనిగూడలో జనావాసాల మధ్యే 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్
- ఇండ్లకు సమీపంలోనే 11 కేవీ తీగలు
- భయందోళనలో గ్రామస్తులు
- వేరే చోటుకు మార్చాలని స్థానికుల విన్నపం
- నిధులున్నా పనులు కాని వైనం

శంషాబాద్ రూరల్: 'దేవుడు కరుణించినా పూజారి కరుణించలేదు' లేదు అన్నట్లు ఉంది పిల్లోనిగూడ గ్రామస్తుల పరిస్థితి. ఊరి మధ్యలోని ట్రాన్స్‌ఫార్మర్, ఇండ్లకు సమీపంలోనే ఉన్నా కరెంట్ తీగలను వేరేచోటుకు మార్చేందుకు ఎమ్మెల్సీ చొరవతో నిధులు మంజూరైనా ట్రాన్స్‌కో అధికారుల తీరుతో సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు.

పిల్లోనిగూడలో ఇండ్లమధ్యే ట్రాన్‌ఫార్మర్

మండలంలోని పిల్లోనిగూడ గ్రామం మధ్యలోనే 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీనికి కరెంట్ సరఫరా అయ్యే 11 కేవీ తీగలు కూడా ఇండ్లకు సమీపం నుంచే ఉన్నాయి. కనీసం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయక పోవడంతో ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

నిధుల వేట..

ట్రాన్స్‌ఫార్మర్‌ను గ్రామం చివరకు మార్చి.. తీగలను కూడా తొలగించాలని కోరుతూ స్థానికులు, పంచాయతీ పాలవర్గ సభ్యులు చాలాసార్లు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించారు. అయితే పంచాయతీ నుంచి డబ్బులు చెల్లిస్తేనే పనులు చేపడతామని వారు మెలిక పెట్టారు. అసలే కొత్తగా ఏర్పాటు అయిన పిల్లోనిగూడ పంచాయతీ ఆదాయం అంతంత మాత్రమే. రూ.లక్షల్లో డబ్బులు సమకూర్చడం వీలుకాక వారు ఈ సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు.



పిల్లోనిగూడ గ్రామంలో ఇండ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఎమ్మెల్సీ నుంచి నిధులు మంజూరు..

గ్రామస్తుల విన్నపం మేరకు ఎమ్మెల్సీ వాణీదేవి ఇందుకు కావాల్సిన నిధులు రూ.10 లక్షలు మంజూరు చేసేందుకు ఒప్పుకున్నారు. దీంతో ట్రాన్స్‌కో అధికారులు రూ.8,60,000 అవసరమని అంచనాలు రూపొందించారు. ఎస్టిమేషన్ ఆధారంగా నిధుల విడుదల కోసం స్థానికులు గతేడాది జూలైలో కలెక్టర్‌ను సంప్రదించగా నిధులు మంజూరు చేశారు. తర్వాత పనులు చేపట్టాలని స్థానికులు ట్రాన్స్‌కో అధికారులను కోరితే మొదట వేసిన అంచనా ప్రకారం.. పనులు చేపట్టేందుకు నిధులు సరిపోవంటూ.. మరిన్ని అదనంగా నిధులు కావాలని కొత్తగా అంచనా రూ.9,96,000 రూపొందించారు. అయితే దానికి కలెక్టర్ అంగీకరించకపోవడంతో పనులు మొదలు కాలేదు.

వింతగా ట్రాన్స్‌కో అధికారుల తీరు..

ట్రాన్స్‌ఫార్మర్, కరెంట్ తీగలు మార్చేందుకు ట్రాన్స్‌కో అధికారులు రెండు రకాలుగా అంచనాలు రూపొందించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరైన అంచనా వేయకుండా ఇలా తప్పుదోవ పట్టించడం ఏమిటని మండి పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి ఎమ్మెల్సీ నుంచి మంజూరైన నిధులు వృథాగా కాకుండా పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

నిధులున్నా.. పనులు చేపట్టలేదు..



ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలను వేరే చోటకు మార్చాలని ఐదేళ్లుగా అధికారులు చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. తీరా నిధులు మంజూరు చేయిస్తే.. అధికారులు తప్పుడు అంచనాలు వేసి పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలి.

-కె.బుచ్చమ్మ, మాజీ సర్పంచ్, పిల్లోనిగూడ

ముగిసిన అంతర్ కళాశాలల పోటీలు



ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మూడు రోజులుగా కొనసాగిన అంతర్ కళాశాలల పోటీలు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ వెంకటరమణ, యూనివర్సిటీ అబ్జర్వర్ త్రివేణి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఉల్లాసం కలుగుతుందన్నారు. పోటీల్లో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యుడు నరేందరెడ్డి, పీజీ డీన్ ఆఫ్ స్టడీస్ డాక్టర్ అనిత, విజయలక్ష్మి, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోకాపేటలో బీజేపీ కోర్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి

మణికొండ: చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ మల్లారెడ్డి అధ్యక్షతన కోకాపేటలో బుధవారం కోర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు చేయాల్సిన ప్రచారం, విధుల గురించి చర్చించారు. నియోజకవర్గవ్యాప్తంగా బీజేపీ గాలి వీస్తుందని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇతర పార్టీలకు ఓట్లు వేసిన వారు సైతం ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని నాయకులు పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, కేఎస్ రత్నం, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

డివిజన్లను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



హైదర్షాకోట్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ పీ రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. 15వ డివిజన్ హైదర్షాకోట్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో అలసత్వం లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంగీతం దశరథ్, లక్ష్మారెడ్డి, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి

ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్‌కు వినతి



ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్‌కు వినతి పత్రం ఇస్తున్న నరేందర్, సంజయ్‌యాదవ్

శంషాబాద్: పట్టణంలోని దోసికుంట ఎఫ్‌టీఎల్‌ను ఆనుకుని అక్రమంగా నిర్మాణం చేస్తున్న భారీ సెల్లార్ పనులను వెంటనే అడ్డుకోవాలని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ ధర్మనాయక్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ నిర్మాణంతో కుంట ఉనికి కోల్పోవడంతో పాటు పక్కనే ఉన్న ఔటర్ సర్వీసు మునిగిపోతుందన్నారు. అంతేగాకుండా శ్మశాన వాటిక వెళ్లేందుకు సైతం ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



మాట్లాడుతున్న మణికొండ రెడ్డి సంఘం నాయకులు

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంపై మణికొండ రెడ్డి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మణికొండలోని సంఘం కార్యాలయంలో బుధవారం సమావేశమై సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటుతో రెడ్డిల్లో ఉన్న పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించడంతో పాటు రూ.5వేల కోట్ల నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మణికొండ రెడ్డి సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర సంఘం కార్యవర్గ సభ్యుడు శ్రీపతిరెడ్డి, నాయకులు రమణరెడ్డి, రామసుబ్బారెడ్డి, శరత్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంకట్‌రెడ్డితో పాటు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. చేశ్ల నవీన్‌కుమార్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జనార్దన్, విష్ణు, పాండు, శంకర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి రిమాండ్

అత్తాపూర్: హత్యాయత్నం కేసులో ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నాగరాజు తెలిపారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన రామ్ లింగ్ (23), శివలింగ్ (22), శంకర్ (25) స్నేహితులు. వీరు కొన్నేళ్లుగా నందిముస్లాయిగూడ సాయినగర్ ప్రాంతంలో నివాసముంటున్నారు. అత్తాపూర్ చౌరస్తాలో ఉన్న స్టార్ హోటల్‌లో బీహార్ రాష్ట్రానికి చెందిన నితీశ్ (27) పని చేస్తూ ఉంటాడు. మంగళవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో టీ తాగేందుకు అత్తాపూర్ 143 పిల్లర్ నుంచి రాంబాబు వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. రాంబాబు నుంచి అత్తాపూర్ వైపు బైక్‌పై వెళ్తున్న ముగ్గురు నితీశ్‌ను ఎక్కడికి వెళ్తున్నావు..? అంటూ గొడవ పడ్డారు. తమకు గౌరవం మర్యాద ఇవ్వడం లేదని వెంట తెచ్చుకున్న చాకుతో హత్యాయత్నం చేశారు. తప్పించుకునే క్రమంలో నితీశ్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం రామ్‌లింగ్, శివలింగ్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. తప్పించుకొని తిరుగుతున్న శంకర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంటలంటుకుని కారు దగ్ధం



శంషాబాద్ రూరల్: అకస్మాత్తుగా మంటలు చెలరేగి కారు దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా బల్లెపల్లికి చెందిన ఉపేందర్‌రావు తన కారులో మంగళవారం రాత్రి రాయచూర్‌కు బయలుదేరాడు. ఇతనితో పాటు డ్రైవర్ ఆర్.రాజేశ్, స్నేహితుడు జి.కల్యాణ్ ఉన్నారు. మండలంలోని మదన్‌పల్లి వద్దకు అర్ధరాత్రి చేరుకున్నది. బెంగళూరు జాతీయ రహదారిపై వెళ్తుండగా కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన ఉపేందర్‌తో పాటు మిగితా ఇద్దరు వెంటనే ఆపి దిగిపోగా కారు పూర్తిగా దగ్ధమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెలాఖరులోగా వందశాతం ఆస్తిపన్ను వసూలు

అత్తాపూర్: ఈ నెలాఖరులోగా వందశాతం ఆస్తిపన్ను వసూలు చేస్తామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రవి కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్-6లో టార్గెట్ రూ. 52.46 కోట్లు ఉండగా.. ఇప్పటివరకు రూ. 39.50 కోట్లు వసూలు చేశామని, ఇంకా రూ. 12.96 కోట్ల పన్నులు వసూలు కావాల్సి ఉందన్నారు. బకాయిలను కూడా సాధించుకునేందుకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, అవసరమైతే ఆస్తులను జప్తు చేసేందుకు కూడా అధికారులు కసరత్తు చేస్తున్నారని తెలిపారు.

అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటాం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండి వారి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం కార్వాన్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు ఆయనను కలిసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లోని సమస్యలు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మూడోసారి ఎన్నుకున్న ప్రజలకు ఎప్పుడూ.. అందుబాటులో ఉంటున్నానన్నారు. వేసవిలో ప్రధానంగా తాగునీటి సరఫరాపైనే సమస్యలు వస్తున్నాయన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో నీటి సరఫరాపై ఇప్పటి వరకు ఎలాంటి కోతలు లేవని నీరు అందరికీ అందుతుందన్నారు. సాంకేతిక కారణాల వల్ల పలు ప్రాంతాలకు లో ప్రెజర్ నీరు వస్తుందన్న విషయం తన దృష్టికి వచ్చిందని వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో నీటి బూస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీన్ని వల్ల లో ప్రెజర్ సమస్య పూర్తిగా తొలగిపోయిందని పేర్కొన్నారు. రంజాన్‌లో మసీదులకు జలమండలి ద్వారా తాగునీరు అందిస్తున్నామని, నీటి ట్యాంకర్ కోసం మసీదు నిర్వాహకులు జలమండలి వారికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

అశోకా లివియానాలో వినాయక హోమం



హోమంలో పాల్గొన్న రవికాంత్‌రెడ్డి తదితరులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, ఔటర్‌రింగ్ రోడ్డు టోల్‌గేట్ సమీపంలోని అశోకా లివియానా టవర్స్‌లో బుధవారం వినాయకుడి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. టవర్ ప్రహరీలో నెలకొల్పిన వినాయకుడికి యేటా పూజా కార్యక్రమాలు చేపడుతామని అశోకా లివియానా సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస్‌బాబు, శ్రీధర్, రఘు, బాబుల్‌రెడ్డి, సభ్యులు దినాకర్, రాజు, లక్ష్మీనారాయణ, అశోక్, సంపత్, శ్రీలత పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ

శంషాబాద్: పట్టణంలో కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ ముఖ్య అతిథిగా హాజరై కవయిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొల్ల జీవితం స్త్రీ జాతికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు డి. వెంకటేశ్‌గౌడ్, కౌన్సిలర్ భారతమ్మ, కొనమొల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో..



జయంతి వేడుకల్లో పాల్గొన్న సొసైటీ సభ్యులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ ఓల్డ్ విలేజ్‌లో అత్తాపూర్ కుమ్మరి సొసైటీ ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ.. నాటి కాలంలో మహిళల్లో అభ్యుదయ భావాలు కలిగించిన మాతృమూర్తి మొల్లమాంబ అని కొనియాడారు. తొలి తెలుగు కవయిత్రి రామాయణాన్ని తొలిసారిగా తెలుగులో రచించిన మొల్లమాంబ 15వ శతాబ్దానికి చెందిన మహోన్నతమైన గొప్ప రచయిత్రి అని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు యాదయ్య, లక్ష్మీనారాయణ, భిక్షపతి, శ్రీరాములు, లక్ష్మణ్, శంకర్, అనిల్, చింటు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ స్థితిగతులపై చర్చ



బీజేపీ నాయకుడు బొక్క బాల్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కే వెంకటరమణ రెడ్డి

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లిలోని ఆయన నివాసంలో బీజేపీ సీనియర్ నాయకుడు బొక్క బాల్‌రెడ్డిని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి బుధవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. ఆయన వెంట నాయకులు, డివిజన్ అధ్యక్షులు బాబురావు, విట్టల్, కీర్తి, శ్రీను, గోనె శ్రీకాంత్ రెడ్డి, కొంగళ్ల నవీన్, అజయ్ కాంత్ రెడ్డి, వాసు, రాజ మహేశ్, పెంట రెడ్డి, రాజా రమేశ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లారీ కింద పడి డెలివరీ బాయ్ మృతి

గచ్చిబౌలి: వెనక నుంచి వస్తున్న లారీ కింద పడి ఓ జెప్టో డెలివరీ బాయ్ దుర్మరణం పాలైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీజారెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణ్‌పేట జిల్లా, మద్దూర్ మండలం, రేనినట్ల గ్రామానికి చెందిన ఎరుకల ఆంజనేయులు(26) లంగర్‌హౌస్‌లో నివాసం ఉంటున్నాడు. జెప్టోలో డెలివరీ బాయ్‌గా చేస్తున్న ఆంజనేయులు మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో బైక్‌పై గచ్చిబౌలి జంక్షన్ నుంచి మెహిదీపట్నం వైపు వెళుతుండగా గచ్చిబౌలిలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ముందు వెనక నుంచి ఆక్సిజన్ సిలిండర్ల లోడ్‌తో వస్తున్న లారీ కిందపడ్డాడు. ముందు చక్రాలు రెండు కాళ్లపై నుంచి వెళ్లడంతో ఛిద్రమయ్యాయి. వెంటనే కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి బేగంపేట్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటలకు మృతి చెందాడు. ముందు వాహనాన్ని తప్పించబోయి పడిపోయాడా లేక లారీ ఢీ కొందా అనేది తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సరఫరా సమయాన్ని పెంచాలి

రాజేంద్రనగర్: రంజాన్ మాసంలో తాగునీటి సరఫరా సమయాన్ని పెంచాలని రాజేంద్రనగర్ డివిజన్ ఫోర్ట్ వ్యూ కాలనీవాసులు కోరారు. కాలనీలో వారు మాట్లాడుతూ.. బుధవారం మంచినీటి సరఫరా కావాల్సి ఉన్నా.. రాలేదన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా జలమండలి ఉన్నతాధికారులు స్పందించి ప్రతిరోజు సమయాన్ని పెంచి నీటి సరఫరా చేయాలని కోరుతున్నామన్నారు.

మహిళలకు పోటీలు

శేరిలింగంపల్లి: మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా శేరిలింగంపల్లి నేతాజీనగర్‌లో మహిళలకు పలు పోటీలు నిర్వహించారు. మహిళా సంఘం నాయకురాలు కుమారి ఆధ్వర్యంలో మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, టేబుల్ కప్ పోటీలు నిర్వహించారు. విజేతలకు త్వరలో బహుమతులను అందజేస్తామని కుమారి తెలిపారు.

రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి

డిప్యూటీ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న జోన్ ఎస్‌డబ్ల్యూఎం డిప్యూటీ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి

శేరిలింగంపల్లి: స్వచ్ఛ ఆటోల ద్వారా ఇళ్లు, షాపుల నుంచి చెత్తను సేకరించాలని శేరిలింగంపల్లి జోన్ సాలిడ్ వేస్ట్ మేనేజమెంట్ డిప్యూటీ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం శేరిలింగంపల్లి సర్కిల్ శానిటేషన్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చెత్తను రోడ్లపై వేయకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. శానిటేషన్‌పై ఫిర్యాదులు వస్తే 24 గంటల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. తడి, పొడి చెత్తపై అపార్టుమెంట్ల వాసులకు అవగాహన కల్పించాలని, ఎస్ఎఫ్ఏలు బాధ్యత తీసుకోవాలన్నారు. గార్బేజ్ వనరబుల్ పాయింట్స్‌ను గుర్తించి 15 రోజుల్లో వాటిని తొలగించాలని, లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్కిల్ ఉపవైద్యాధికారి నగేష్ నాయక్, శానిటరీ సూపర్‌వైజర్ జలంధర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీలు, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి విరాళం



ఎస్ఓఎస్‌కు విరాళం అందజేస్తున్న స్వప్న

మణికొండ: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా టీసీపీ వేవ్ సంస్థ వట్టినాగులపల్లిలోని ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌కి రూ.లక్ష విరాళం అందజేసింది. బుధవారం విలేజ్‌లో జరిగిన కార్యక్రమంలో చెక్కు, పత్రాన్ని అందజేశారు. సంస్థ సీఎస్ఆర్ విభాగం అధిపతి స్వప్న అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆదరణ కోల్పోయిన పిల్లలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యతను ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్ స్వచ్ఛంద సంస్థ తీసుకోవడం అభినందనీయమన్నారు. ఇలాంటి సంస్థలకు తమవంతుగా బాధ్యత తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో విలేజ్ డైరెక్టర్ కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళలదే కీలకపాత్ర



గోల్కొండ: సమాజ నిర్మాణంలో మహిళలదే కీలకపాత్ర అని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సేవా సమితి అధ్యక్షులు బొమ్మల శ్రీకాంత్‌చారి అన్నారు. బుధవారం గోల్కొండ ఉర్దూ స్కూల్‌లో గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయ వృత్తి పనివార్ల సంఘంతో కలిసి మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల టీచర్లు, ఆయాలకు విద్యారంగంలో విశిష్ట సేవా పురస్కారాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నేడు అక్షరాస్యత శాతం పెరగడానికి మహిళలే కారణమని అన్నారు. విద్యాబోధన రంగంలో మహిళలు విశేషంగా రాణిస్తున్నారని విద్యార్థులను తీర్చిదిద్దడంలో వారిదే కీలకపాత్ర అని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలోనే కాకుండా ఇతర రంగాల్లో సైతం పురుషులకు దీటుగా మహిళలు ముందుకు సాగుతున్నారన్నారు. సాయిబాబాచారి, ఉర్దూ హైస్కూల్ అకడమిక్ హెడ్ సమీనాతస్నీమ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత జాబేర్ పటేల్ మృతి



గోల్కొండ: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్రముఖ సంఘ సేవకుడు జాబేర్ పటేల్ (58) మృతి చెందారు. టోలిచౌకీ తూమ్స్‌రోడ్‌లో ఉండే ఆయనకు మంగళవారం రాత్రి ఛాతిలో నొప్పి రావడంతో ఆయనను హైదర్‌గూడలోని అపోలో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు సంతానం. కాగా జాబేర్ పటేల్ ఆల్ ఇండియా మైనార్టీ ఫోరం చైర్మన్, ఇండో అరబ్ ఫ్రెండ్‌షిప్ ఫౌండేషన్ చైర్మన్‌గా గత రెండు దశాబ్దాలుగా పని చేస్తున్నారు. సాబిర్ పటేల్ ఎంటర్‌ప్రైజెస్ అధ్యక్షుడిగా ఉంటూనే హిందూ, ముస్లింల ఐక్యత కోసం ఎన్నో కార్యక్రమాలను చేపట్టారు. మామిడి పండ్ల రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఆయన తన తండ్రి సాబిర్ పటేల్‌తో కలిసి ఎంతో కృషి చేశారు.

కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

రాయదుర్గం: రాష్ట్రంలో మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుపై మున్నూరు కాపు ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. శాసనసభ ప్రాంగణంలో వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌ను బుధవారం అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం జంగయ్య, సభ్యులు శ్రీనివాస్, చంద్రప్రకాశ్, ఇతర సభ్యులు కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.